రెట్టింపు వినోదం ఖాయం

'డీజే టిల్లు' చిత్రం ద్వారా యూత్‌కు బాగా చేరువయ్యారు హీరో సిద్ధు జొన్నలగడ్డ హైదరాబాద్ బస్తీ యువకుడిగా ఆయన పండించిన హాస్యం అందరికి గుర్తుండిపోయింది. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. మార్చి 29న ప్రేక్షకుల ముందు కురా నుంది. వాలెంటైన్స్ డేను పురస్కరించుకొని బుధవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ప్రేయసి రాధిక కారణంగా చిక్కుల్లో పడ్డ టిల్లు.. సీక్వెల్‌లో కూడా అదే తరహా సమస్యలను ఎదుర్కొంటూ కనిపించారు. ఆద్యంతం హాస్య ప్రధానంగా ఊహించని ట్విస్ట్‌లతో ట్రైలర్ ఆసక్తిని పెంచింది. తొలి భాగం కంటే రెట్టింపు వినోదంతో ఈ సినిమాను తెరకెక్కించామని, ఇప్పటికే విడుదలైన పాటలు వైరల్ అవుతున్నాయని, టిల్లు పంచే వినోదం ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయిప్రకాష్ ఉమ్మడిసింగు, సంగీతం: రామ్ మిరియాల.

సిద్ధు, అనుపమ పరమేశ్వరన్

అట్లీ దర్శకత్వంలో...

'పుష్ప' చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు అగ్ర హీరో అల్లు అర్జున్. ఇక 'జవాన్' చిత్రంతో దేశవ్యాప్తంగా తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నాడు తమిళ దర్శకుడు అట్లీ. మరి వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటే అభిమానులకు ఇక పండగే. తాజా సమాచారం ప్రకారం ఈ ప్రెస్టిజీయస్ ప్రాజెక్ట్‌కు రంగం సిద్ధమవుతున్నట్లుగా తెలిసింది. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప-2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆగస్ట్ 15న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా అనంతరం అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ సినిమా పట్టాలెక్కుతుందని అంటున్నారు. ఇప్పటికే ఈ విషయమై ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని సమాచారం. అగ్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ భారీ పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కించబోతున్నదని అంటున్నారు. అయితే ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

మైఖేల్ జాక్సన్ బయోపిక్ ఫస్ట్ లుక్

పాప్ కింగ్ మైఖేల్ జాక్సన్ జీవిత విశేషాలతో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ బయోపిక్‌లో జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తున్నారు. ఆంటోయిన్ పుక్వా దర్శకత్వం వహిస్తుండగా.. 'గ్లాడియేటర్', 'ది ఏవియేటర్' చిత్రాలను రాసిన జాన్ లోగన్ స్క్రిప్ట్ రాశారు. మైఖేల్ జాక్సన్ ఎస్టేట్‌కు సహ నిర్వాహకులుగా ఉన్న జాన్ బ్రాంకా, జాన్ మెక్‌క్లెయిన్‌లతో కలిసి గ్రాహం కింగ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 2025, ఏప్రిల్ 18న విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించి ఫస్ట్‌లుక్‌ను లయన్స్ గేట్ ఫిల్మ్స్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో బుధవారం షేర్ చేసింది. ఈ ఫొటోలో జాఫర్ జాక్సన్ అచ్చం తన మేనమామ 1992-93ల్లో కలిగి ఉన్న రూపంలో ఆకట్టుకున్నారు. మైఖేల్ సంతకం ముద్రించి ఉన్న తెల్లటి చొక్కాను ధరించి మైక్ చేతపట్టుకొని కనిపించాడు. మైఖేల్ కెరీర్‌లో సింహభాగం ఫొటోలను తీసిన కెవిన్ మజూర్ ఈ ఫస్ట్‌లుక్‌ను క్లిక్‌మనిపించారు. మైఖేల్ జాక్సన్ జీవితాన్ని నిజాయితీగా చిత్రీకరించడమే తమ లక్ష్యమని చిత్ర నిర్మాత గ్రాహం కింగ్ పేర్కొన్నారు.

మలయాళ దర్శకుడు ప్రకాశ్ కొలేరి మృతి

మలయాళ దర్శకుడు ప్రకాశ్ కొలేరి (65) కేరళలోని వాయనాడ్‌లో ఉన్న తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. వాయనాడ్‌లో ఒంటరిగా ఉంటున్న ఆయన రెండు రోజులుగా బయటికి రాకపోవడంతో ఇరుగుపొరుగు వారికి అనుమానం వచ్చింది. దీంతో వారు మంగళవారం సాయంత్రం ఇంట్లోకి వెళ్లి చూడగా ఆయన శవమై కనిపించారు. స్థానికుల సమాచారంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రకాశ్ కొలేరి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. తాను తొలిసారి దర్శకత్వం వహించిన 'మిజియితలిల్ కన్నీరుమయి' సినిమా ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. 1999లో విడుదలైన 'వరుణ్ వారధిరికిల్ల' తర్వాత ఆయన సుదీర్ఘ విరామం తీసుకున్నారు. 14 ఏళ్ల విరామం తర్వాత 'పాట్టుపుస్తకం' చిత్రానికి మళ్లీ దర్శకత్వం వహించారు. ఫిలిం మేకర్‌గా ఇదే ఆయనకు చివరి సినిమా. దర్శకుడిగా పేరు తెచ్చుకున్న ఆయన స్క్రిప్ట్ రైటింగ్, నటన నేర్చుకున్నారు.

అనూహ్య మలుపులతో 'భామా కలాపం-2'

ఆహా స్టూడియోస్‌తో కలిసి బాపినీడు, సుధీర్ ఈదర డ్రీమ్ ఫార్మర్స్ సంస్థ నిర్మించిన చిత్రం 'భామా కలాపం-2'. అగ్ర కథానాయిక ప్రియమణి ప్రధాన పాత్రలో నటించారు. నీరత్ కపూర్, శరణ్య, రఘు ముఖర్జీ, బ్రహ్మాజీ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. అభిమన్యు తడిమేటి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 16 నుంచి ప్రముఖ ఓటీటీ సంస్థ ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ బుధవారం మీడియాతో ముచ్చటించింది. హీరోయిన్ ప్రియమణి మాట్లాడుతూ.. ''భామా కలాపం-2'లో అన్నీ డబుల్ ఉంటాయి. ఎక్కువ థ్రిల్స్, ట్విస్ట్‌లతో ఈ సినిమా కథ ఆసక్తికరంగా ఉంటుంది. మహిళ తలుచుకుంటే ఏదైనా సాధించగలదని ఈ చిత్రం ద్వారా తెలియజెప్పాం' అని చెప్పారు. 'నేను కాలేజీలో చదువుకుంటున్నప్పటి నుంచీ ప్రియమణి గారికి అభిమానిని. ఆమెతో వరుసగా రెండు సినిమాలు చేయడం ఆనందంగా ఉంది' అని దర్శకుడు అన్నారు.

హృద్యమైన ప్రేమకావ్యం

సినిమాల్లోకి వచ్చి హీరోయిన్‌గా రాణించిన తెలుగు అమ్మాయిలను చాలా తక్కువే అని చెప్పొచ్చు. అలాంటిది ఓ తెలుగమ్మాయి తెరపై హీరోయిన్‌గా కనిపించడమే కాక నిర్మాతగా వ్యవహరించడం.. ఇంకా ఆశ్చర్యపరిచేలా చిత్ర కథను సైతం అందించడం టాలీవుడ్ గొప్ప విషయమే. ఔను, ఇప్పుడు సుమయరెడ్డి బహుముఖ ప్రజ్ఞతో ఆకట్టుకోనున్నారు. సుమ చిత్ర ఆర్ట్స్ పతాకంపై 'డియర్ ఉమ' పేరుతో ఓ చిత్రం త్వరలో రాబోతోంది. ఇందులో సుమయరెడ్డి, 'దియా' మూవీ ఫేమ్ పృథ్వీ అంబర్ జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను వాలెంటైన్స్ డే సందర్భంగా బుధవారం విడుదల చేశారు మేకర్స్. ఇదో ప్రేమ కావ్యమని టీజర్ చూస్తే అర్థమవుతోంది. ప్రేమ ఇచ్చే సంతోషాన్ని, బాధను ఓ దృశ్యకావ్యంగా మలిచినట్లు తెలుస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: రధన్, నిర్మాత: సుమయరెడ్డి, దర్శకత్వం: సాయి రాజేశ్ మహదేవ్.

'డెడ్‌పూల్ అండ్ వోల్వరైన్' ప్రపంచ రికార్డు

'డెడ్‌పూల్'.. అమెరికన్ సూపర్ హీరోల సినిమాలను చూసేవారిని అమితంగా ఆకట్టుకున్న సినిమా ఇది. 2016లో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబట్టింది. ఆ తర్వాత విడుదలైన 'డెడ్‌పూల్-2' కూడా ప్రేక్షకులను అలరించింది. ఈ సిరీస్‌ను కొనసాగిస్తూ రాబోతున్న మరో సరికొత్త సూపర్ హీరో యాక్షన్ ఫిల్మ్ 'డెడ్‌పూల్ అండ్ వోల్వరైన్'. షాన్ లెవీ తెరకెక్కించిన ఈ సినిమాలో రేయాన్ రేనాల్డ్స్, హ్యూ జాన్‌మెన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం జూలై 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదల చేసిన టీజర్.. కేవలం 24 గంటల్లోనే 365 మిలియన్ వ్యూస్‌తో సరికొత్త ప్రపంచ రికార్డు సొంతం చేసుకుంది. ప్రపంచ సినీ చరిత్రలో ఇప్పటిదాకా ఏ చిత్రమూ 24 గంటల వ్యవధిలో ఈ స్థాయి వ్యూస్‌ను పొందలేదు.

సకుటుంబ కథా చిత్రాలతో ప్రత్యేకతను సంపాదించుకున్న సీనియర్ దర్శకుడు కె.విజయ్‌భాస్కర్ తెరకెక్కిస్తున్న ప్రేమకథా చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటీఫుల్' ఉపశీర్షిక. శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష జంటగా నటిస్తున్నారు. వాలెంటైన్ డే సందర్భంగా బుధవారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. 'టాకీ పార్ట్ పూర్తయింది. త్వరలో విదేశాల్లో పాటలను చిత్రీకరించబోతున్నాం. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఆకట్టుకుంటుంది. వినోదానికి పెద్దపీట వేస్తూ రూపొందిస్తున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సంగీతం: ఆర్.ఆర్. ధృవన్, నిర్మాణ సంస్థ: క్రాఫ్ట్ ప్రొడక్షన్, నిర్మాత, దర్శకత్వం: కె.విజయ్‌భాస్కర్.

ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు

స్నేహం గొప్పదనాన్ని తెలియజేస్తూ ఎల్.ఓ.ఎల్. ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మించిన చిత్రం 'ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు'. ఇంద్ర, కోమల్ నాయర్, దీపు, స్వాతి శర్మ, ఇమ్రాన్, శీతల్ భట్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ప్రస్తుతం ఈ సినిమా నుంచి 'నా కల'.. పాటను సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ చేతుల మీదుగా చిత్ర యూనిట్ బుధవారం విడుదల చేసింది. సీనియర్ నటీనటులతోపాటు కొత్తవారు కూడా ఈ సినిమాలో నటించారని నిర్మాతలు తెలిపారు. కొత్త ప్రదేశాల్లో షూట్ చేశామని, చిత్రీకరణ పూర్తి కావస్తోందని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రవణ్ భరద్వాజ్, నిర్మాతలు: చంద్ర ఎస్ చంద్ర, డాక్టర్ విజయ రమేశ్‌రెడ్డి, కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: లక్ష్మణ్.జె.

గ్రామీణ ప్రేమకథ

రక్షిత్ అట్లూరి, కోమలి జంటగా నటిస్తున్న చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి నిర్మించారు. ఏప్రిల్ 5న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'మనసులో పుట్టే ప్రేమ మచ్చలేనిదైతే ఆ ప్రేమకు మరణం కూడా మనతోనే' అంటూ పోస్టర్ మీద వేసిన డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. 'గ్రామీణ నేపథ్యంలో నడిచే హృద్యమైన ప్రేమకథా చిత్రమిది. పోస్టర్ మీద వేసిన డైలాగ్ సినిమా సారాంశాన్ని మొత్తం తెలియజేస్తుంది. మెలోడీ ప్రధానమైన పాటలతో ఆకట్టుకుంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. శ్రీమన్, దీపక్ ప్రిన్స్, జబర్దస్త్ బాబీ, మహేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్రీసాయికుమార్ దారా, సంగీతం: శరవణ వాసుదేవన్, రచన-దర్శకత్వం: సాయిమోహన్ ఉబ్బన.

కాలం రాసిన కథలు

సాగర్, వికాస్, అభిలాష్, రోహిత్, రవితేజ, హరి, శతి శంకర్, విహారిక చౌదరి, ఉమ, హాన్విక, పల్లవి రేష్మ ప్రధాన తారాగణంగా తెరకెక్కుతున్న సినిమా 'కాలం రాసిన కథలు'. ఎస్.ఎం.4 ఫిల్మ్స్ పతాకంపై నిర్మించిన చిత్రమిది. ఫ్యామిలీ, లవ్, సస్పెన్స్ జోనర్‌లో రూపుదిద్దుకున్న ఈ చిత్రం టీజర్ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన పీపుల్స్ మీడియా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీధర్ మాట్లాడుతూ.. 'మనం ప్రతి ఒక్కరి జీవితంలోనూ కాలం కొన్ని కథలు రాస్తుంది. దాన్ని బట్టే మన జర్నీ ఉంటుంది. దర్శకుడు సాగర్ గారు ఇంత మంచి కాన్సెప్ట్ ఎన్నుకోవడంతోనే సగం విజయం సాధించారు' అన్నారు. 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించిన ఈ ప్రేమకథలో ఫ్యామిలీ ఎమోషన్స్, సస్పెన్స్, భక్తి మిళితమై ఉంటాయి' అని చిత్ర రచయిత, దర్శక, నిర్మాత ఎం.ఎన్.వి.సాగర్ చెప్పారు. ఈ సినిమాకు కెమెరా: ఎస్.ప్రసాద్, సంగీతం: మేరుగు అరమాన్.

సందేశంతో 'ఐ హేట్ లవ్'

సుబ్బు, శ్రీవల్లి జంటగా నటించిన సినిమా 'ఐ హేట్ లవ్'. రావి ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై డాక్టర్ బాల రావి (యు.ఎస్.ఏ) నిర్మించారు. వెంకటేశ్.వి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 47 ఏళ్ల క్రితం ఇండియా వదిలి వెళ్లిన తాను మంచి సినిమా చేద్దామని తిరిగి వచ్చానని చెప్పారు. ప్రేమకథగా తెరకెక్కించిన ఈ సినిమాలో సోషల్ మీడియా వల్ల కుటుంబాలు ఎలా నాశనం అవుతున్నాయనే విషయం అంతర్లీనంగా ఉంటుందని తెలిపారు. గోదావరి విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కించామన్నారు. ''ఐ హేట్ లవ్' ట్రీట్‌మెంట్ చాలా డిఫరెంట్‌గా ఉంటుందని దర్శకుడు అన్నారు. ఈ చిత్రానికి కెమెరా మెన్స్: వాసు నాయక్, ఫణి, సంగీతం: పెద్దపల్లి రోహిత్ (పి.ఆర్).